## క్లుప్తంగా

### డీజీపీని కలిసిన కరాటే మాస్టర్



డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాస్టర్ చెన్నయ్య

షాద్‌నగర్: రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జితేందర్‌ను శనివారం పట్టణానికి చెందిన స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, మాస్టర్ ఎత్తిన చెన్నయ్య కలిశారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి వెళ్లిన ఆయన బాధ్యతలు చేపట్టిన జితేందర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### బ్రూస్‌లీకి నివాళి



నివాళులర్పిస్తున్న విద్యార్థులు

షాద్‌నగర్: మార్షల్ ఆర్ట్స్ లెజెండ్ బ్రూస్‌లీ 50వ వర్ధంతిని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సత్యనారాయణస్వామి దేవాలయ ఆవరణలో న్యూ పవర్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులు బ్రూస్ లీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాస్టర్లు బాల్‌రాజ్, అహ్మద్‌ఖాన్, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల్లో అక్షరాభ్యాసం



అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

కొందుర్గు: అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని విశ్వనాథ్‌పూర్, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వీరన్నపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శివరాణి, రేవతి హాజరై మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రం అమ్మ ఒడి లాంటిదన్నారు. చిన్నారులకు క్రమశిక్షణ, విద్యాబుద్ధులు నేర్పించి, పాఠశాలల్లో చేర్పించడానికి సంసిద్ధులుగా తీర్చిదిద్దుతామన్నారు. మూడేళ్లు నిండిన చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు అరుణ, ఇందిర, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



ఆస్పత్రి వద్ద కాయకల్ప బృందం సభ్యులు

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని శనివారం రాష్ట్ర కాయకల్ప బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జున్ నేతృత్వంలో వినయ్, రేవతి, రాములతో కూడిన కాయకల్ప బృందం సభ్యులు ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సదుపాయాలు, మౌలిక వసతులను, పరిశుభ్రతను వారు పరిశీలించారు. 2023–24 సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ ప్రభుత్వ ఆస్పత్రులను ఎంపిక చేసే కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రులను సందర్శిస్తున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కాయకల్ప అవార్డు కోసం 43 ప్రభుత్వ ఆస్పత్రులు పోటీ పడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆస్పత్రుల్లో శానిటేషన్ నిర్వహణ పనులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ ఆస్పత్రులకు ప్రభుత్వం ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటుగా రూ.15లక్షల నగదును అందజేయనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బడంగ్‌పేట్: తిరుమలగిరిలోని పల్లవి మోడల్ స్కూల్‌లో శనివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఎంఎస్ తిరుమలగిరి డైరెక్టర్ డాక్టర్ వైఎస్ కార్తీక్, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్, చీఫ్ హార్టీకల్చర్ అధికారి డాక్టర్ ఎస్.సునందారెడ్డి హాజరై పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.



షాబాద్‌లో చిత్తడిగా మారిన రోడ్డు



మొయినాబాద్: గుంతలమయంగా మొయినాబాద్–అమీర్‌గూడ రోడ్డు

# చినుకు పడితే చిత్తడే..!



మొయినాబాద్: అధ్వానంగా పెద్దమంగళారం–చందానగర్ రోడ్డు



మొయినాబాద్: చిత్తడిగా మారిన కనకమామిడి–వెంకటాపూర్ రోడ్డు

- గుంతల రోడ్లతో ప్రజలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మొయినాబాద్: ఏళ్ల తరబడి రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో ముసురు వర్షాలకు రోడ్లన్నీ చిధ్రమయ్యాయి. రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాటిలో వర్షపు నీరు నిల్వడంతో కుంటలను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులతో పాటు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చాలా గ్రామాల రోడ్లది ఇదే పరిస్థితి. కనకమామిడి–వెంకటాపూర్, సురంగల్–శ్రీరాంనగర్, మొయినాబాద్–చిలుకూరు, పెద్దమంగళారం–చందానగర్, రెడ్డిపల్లి–చిన్నమంగళారం, తోలుకట్ట–నక్కలపల్లి, వెంకటాపూర్–నక్కలపల్లి, మొయినాబాద్–అమీర్‌గూడ రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. ఈ రోడ్లపై వెళ్లాలంటే వాహనదారులు నరకం చూస్తున్నారు. ఆయా గ్రామాలకు నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. గుంతల రోడ్లతో వాహనాలు చెడిపోవడంతో పాటు వాహనాల్లో ప్రయాణించేవారు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వాహనదారులతో పాటు కాలినడకన వెళ్లే మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

**నిలిచిన నీరు.. రాకపోకలకు ఇబ్బంది**

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజంతా ముసురు వర్షం కురిసింది. ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, ప్రైవేటు పనులకు వెళ్లేవారు ఇబ్బందిపడ్డారు. వర్షంతో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్‌లోని ఏవన్ మోటార్ షాపు వద్ద వర్షం నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది.

**చిన్న వర్షానికే..**

షాబాద్: చిన్న వర్షానికే రోడ్డు చిత్తడిగా మారింది. శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న ముసురు వర్షానికి షాబాద్ మండల కేంద్రంలో పీఆర్‌ఆర్ స్టేడియం రోడ్డుకు వెళ్లే పోలీసు స్టేషన్ కమాన్ దగ్గర రోడ్డు బురదమయంగా మారింది. దీంతో ఆ రోడ్డుపై కాలినడకన వెళ్లే ప్రజలు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఈ రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం వేలాది మంది ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు వెళ్తుంటారు. గుంతల్లో నీరు నిలిచి కనిపించక అందులో పడిపోతున్నారు. మట్టిరోడ్లు బురదమయంగా మారాయి. నిర్వహణ లోపంతో డ్రైనేజీలు రోడ్లపైకి పొంగిపొర్లుతున్నారు. షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో రోడ్డులో వర్షపు నీరు నిలిచి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ఎస్సై గోపాలకృష్ణ

నందిగామ: విద్యార్థులు చిన్నప్పటి నుంచే కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్సై గోపాలకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం)ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. చిన్నప్పటి నుంచే ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని లక్ష్యసాధనకు నిరంతరం కష్టపడాలని సూచించారు. పాఠశాలలో పాఠ్యాంశాలు అర్థం కాకపోతే టీచర్లను మళ్లీ అడిగి సమస్యలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తమ పిల్లల చదువుపై దృష్టి సారించాలని, నిత్యం హోంవర్క్ చేయించాలన్నారు. హెచ్ఎం రత్నయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రైతు సంబరాల్లో భాగంగా శనివారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు, రైతులు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి హాజరైన ఎమ్మెల్యే శంకర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యామ్ సుందర్‌రెడ్డిని నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేసిన ఘన త కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలను అమలుకు కృషి చేస్తోందన్నా రు. హరీశ్‌రావు మాటపై ఉంటే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజు, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, నాయకులు పురుషోత్తం రెడ్డి, శివశంకర్‌గౌడ్, చంద్రశేఖర్, వజ్రమ్మ, రజిత, రామయ్యగౌడ్, కావలి యాదయ్య, గోవర్ధన్‌గౌడ్, సాధిక్, ఫయూమ్, అక్రమ్, మానయ్య, పెంటయ్య, దశరథ పాల్గొన్నారు.



కొందుర్గులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

# విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరం

మాజీ సర్పంచ్ లావణ్యశంకర్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ లావణ్య, గ్రామస్తులు

చేవెళ్ల: పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని రామన్నగూడ మాజీ సర్పంచ్ నడిమొల్ల లావణ్య శంకర్ అన్నారు. మండలంలోని రామన్నగూడ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఇటీవల బదిలీపై కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం చెబుతూ సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులు గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, ప్రైవేట్‌గా ఉపాధ్యాయుల నియామకానికి కృషి చేయాలని కోరారు. దీంతో మాజీ సర్పంచ్ లావణ్య ముందుకొచ్చి పాఠశాలలో అవసరమైన విద్యావలంటీర్లను నియమించుకోవాలని, వారికి అయ్యే ఖర్చును తాను భరిస్తానని ఉపాధ్యాయులకు హామీనిచ్చారు. మాజీ సర్పంచ్‌ను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం లావణ్య మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలను అందించాలన్నారు. తన వంతు సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. కొత్తగా ఉపాధ్యాయులు వచ్చే వరకు ప్రైవేటు టీచర్లను పెట్టుకొని విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ వార్డుసభ్యులు, నాయకులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### తల్లీకూతురు అదృశ్యం



ఫాతిమా(ఫైల్)



హనీమాఫాతిమా(ఫైల్)

మొయినాబాద్: మేనమామ ఇంటికి బయలుదేరిన తల్లీ కూతురు అదృశ్యమయ్యారు. ఈ సంఘటన మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన మహ్మద్ అమీర్ భార్య ఫాతిమా (25), రెండు నెలల కూతురు హనీమాఫాతిమాతో కలిసి నగరంలోని ఎల్‌బీనగర్‌లో ఉండే తన మేనమామ ఇంటికి వెళ్తానని ఈ నెల 13న ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. మేనమామ ఇంటికి చేరుకోకపోగా తిరిగి ఇంటికి కూడా రాలేదు. దీంతో అమీర్ పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో శనివారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

### సమస్యలను పరిష్కరించాలి

షాబాద్: గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండలంలోని కుర్వగూడ గ్రామ యువకులు దాదె మహేశ్, జనిగే మల్లేశ్, శ్యామ్‌సుందర్‌లు పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అపర్ణకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో వీధి దీపాలు లేక రాత్రిపూట ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వీధుల్లో పిచ్చిమొక్కలు పెరిగి దోమలు, ఈగలతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. నీరు నిలిచే ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల నివారణకు మందులు పిచికారీ చేయాలన్నారు. అంతారం సబ్‌స్టేషన్ పరిధిలో ఎన్నోసార్లు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

### రుణమాఫీపై సంబరాలు

చేవెళ్ల: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ప్రకటించటంపై గ్రామాల్లో రైతులు సంబరాలు చేసుకుంటున్నారు. శనివారం రాత్రి మండలంలోని రావుపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గ్రామంలో లక్ష రూపాయల వరకు రుణాలు మాఫీ అయిన రైతులు సంతోషంగా వారి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ బాలయ్యగౌడ్, రాంచంద్రయ్యగౌడ్, కృష్ణారెడ్డి, జి.సుదర్శన్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, సుశీలబాల్‌రాజ్, ముత్యాలుగౌడ్, ప్రకాశ్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, యాదగిరిగౌడ్, శంకర్, నరేందర్, సత్యనారాయణ, శేఖర్, రాజేదర్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్‌కు సన్మానం

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో మత్స్యకార్మికులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. నగరంలో నిర్వహించిన రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మండల ఫెడరేషన్ సభ్యులు పెద్ద ఎత్తున తరలివెళ్లి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన ఫెడరేషన్ సభ్యులందరినీ అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అభివృద్ధిలో పాలుపంచుకొని సహకరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మత్స్యకారుల విభాగం జిల్లా చైర్మన్ బాకారం మహేందర్‌ముదిరాజ్, మత్స్యకారుల వైస్ చైర్మన్ గడ్డం యాదగిరి, మొయినాబాద్ మండల మత్స్యకారుల వైస్ చైర్మన్ తెలుగు వెంకటయ్య ముదిరాజ్, వెలుగుల యాదగిరి, గంగపుత్రులు తదితరులు పాల్గొన్నారు.



మెట్టు సాయికుమార్‌ను సన్మానిస్తున్న మహేందర్ ముదిరాజ్, తదితరులు

# నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్



వాహనంలో మహాధర్నాకు వెళ్తున్న నాయకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన మహాధర్నా కార్యక్రమానికి షాద్‌నగర్ నుంచి బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్యాట అశోక్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. ఈ వాహనాల ర్యాలీని శ్రీవర్ధన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. గతంలో కేసీఆర్ నిరుద్యోగులను మోసం చేసిన విధంగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రస్తుత డీఎస్సీ పరీక్షలను వాయిదా వేసి నూతన తేదీలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని, పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీఓ నెంబర్ 46ను వెంటనే రద్దు చేయాలని, జాబ్ కేలండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహాధర్నాకు తరలిన వారిలో నాయకులు రణధీర్‌గౌడ్, పుట్నాల సాయికుమార్, సందీప్ యాదవ్, ఉదయ్‌గౌడ్, సుబ్రమణ్యం, సాయిగౌడ్, మల్లేశ్, విజయ్, యాదయ్య, మణికంఠ, శ్రీకాంత్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

# సమస్యల పరిష్కారానికి చర్యలు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న నరేందర్

మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్

షాద్‌నగర్: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. శనివారం పట్టణంలోని 8వ వార్డులో పర్యటించి కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటుగా పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైనేజీలు శుభ్రం చేయాలని, చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడూ తొలగించాలని, విద్యుత్ లైట్ల సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కాలనీల్లోని గుంతల్లో, ఓపెన్ ప్లాట్లలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా డ్రైనేజీలు శుభ్రం చేసి, చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నట్లు తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి మున్సిపల్ సిబ్బంది, అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సాయిబాబా, సుధీర్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

చేవెళ్ల: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులతో కలిసి నగరంలో సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. చేవెళ్ల నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి ఎమ్మెల్యేతో పాటు సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కాలె యాదయ్య అంబేడ్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా ప్రమాణ స్వీకారం చేసిన మాజీ ఎంపీ కే.కేశవరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కలిశారు. అదేవిధంగా చేవెళ్లకు చెందిన కాంగ్రెస్ నాయకుడు పీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ సున్నపు వసంతం నగరంలో ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

# సకాలంలో వేతనాలు అందించాలి

మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయుల నిరసన





ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

చేవెళ్ల: ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీతాలు సకాలంలో చెల్లించాల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. చేవెళ్లలోని ఆదర్శ పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టీనావతి మాట్లాడుతూ.. ఈనెల 20వ తేదీ అవుతున్నా నేటికీ ఉపాధ్యాయులకు జీతాలు రాలేదన్నారు. ప్రతినెల ఈ విధంగానే సకాలంలో జీతాలు రావటం లేదన్నారు. దీంతో బ్యాంకులలో ఉన్న ఈఎంఐలు, ఇంటి అద్దెలు, కుటుంబ అవసరాలకు ఇబ్బందిగా మారుతోందని తెలిపారు. ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు సకాలంలో ఒకటో తేదీన ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలని కోరారు. 11ఏళ్లుగా ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోవటం లేదన్నారు. ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, హెచ్‌బీటీ ఉద్యోగులకు మూడునెలల నుంచి వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, వశీధర్‌రెడ్డి, లక్ష్మిప్రసాద్‌గౌడ్, రుక్మిణీ, శ్రీదేవి, మల్లీశ్వరి, ఆస్మా అమీర్, అనంత, యశోద, సుధీర, శివ, రమేశ్, తదితరులు ఉన్నారు.